

www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 20 ఫిబ్రవరి 2023
5
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు




24న చంద్రబాబు రాక..!

ఐదు పార్లమెంటు నియోజకవర్గాల సమీక్ష


చంద్రబాబునాయుడు, టిడిపి అధినేత

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి : టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈనెల 24న జిల్లాకు రానున్నారు. నెల్లూరు నగరంలో ఐదు ఎంపి నియోజకవర్గాల ముఖ్యనేతలతో సమావేశం నిర్వహించనున్నారు. ఒక్కో నియోజ కవర్గం నుంచి బూత్‌కమిటీ నేతలు, సుమారు 70 నుంచి 80 మందిని ఆహ్వా నిస్తున్నారు. నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, రాజంపేట, ఒంగోలు పార్లమెంట్ నియోజకవర్గాల్లోని అన్ని అసెంబ్లీ నియోజ కవర్గాల నుంచి సుమారు 3వేల మంది నాయకులు ఈ సమావేశానికి రానున్నారు. ఇంత మంది కూర్చునే విధంగా ఉన్న హాల్ కోసం పార్టీ నేతలు అన్వేషిస్తున్నారు. నందమూరి తారకరత్న మృతి చెందడంతో టిడిపి పొలిట్ బ్యూరోసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, ఆపార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర హైదరాబాద్ వెళ్లడంతో ఆదివారం జరగాల్సిన సమావేశం వాయిదా పడింది. వారు వచ్చిన వెంటనే వేదిక ఫైనల్ చేయనున్నారు. ఇటీవల వైసిపిని వీడిన ఆనం రామనారాయణరెడ్డి, కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి టిడిపిలో చేరుతారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతానికి అవకాశం లేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు.

'మేరిగ'కు ఎంఎల్‌సి అవకాశం..!

వైసిపిలో దళిత నేత మేరిగ మురళికి ఎంఎల్‌సి అవకాశం దక్కింది. మూడు దశాబ్దాలుగా రాజకీయాల్లో క్రియాశీలకంగా పనిచేస్తున్నా ఆయనకు అనేక సార్లు చట్టసభల్లో కూర్చునే అవకాశం చేజారింది. గత ఎన్నికల్లో గూడూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి వైసిపి అభ్యర్థిగా ఉంటారని అందరూ భావించారు. చివరి నిమిషంలో అవకాశం దక్కలేదు. అప్పట్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ఇప్పుడు నిలబెట్టుకున్నారు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా ఆయనను ఎంపిక చేసినట్లు తెలిసింది. అధికారికంగా ప్రకటించాల్సింది. ప్రతిపక్షాలు పోటీలో లేకపోవడంతో ఆయన ఎంపిక లాంచనమే...

- మూడు దశాబ్దాలు నిరీక్షణ
- 22న నామినేషన్ దాఖలు
- మాట నిలుపుకున్న ముఖ్యమంత్రి

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి

మేరిగ మురళీ రాపూరు ప్రాంతానికి చెందిన నేత. సుమారు మూడు దశాబ్దలుగా రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉన్నారు. టిడిపిలో పాపకన్ను రాజశేఖర్‌రెడ్డి అనుచరుడుగా పనిచేశారు. స్థానిక జడ్‌పిటిసి సభ్యుడిగాను పనిచేశారు. దళిత నాయకుడుగా ఆ ప్రాంత ప్రజలకు సురపరిచితుడు. సౌమ్యుడుగా, రాజకీయాల్లో ఉన్నప్పటికీ పెద్దగా అవకాశాలు రాలేదు. జగన్‌మోహన్‌రెడ్డి వైసిపి స్థాపించిన తర్వాత ఆయన ఆపార్టీలో చేరారు. మేకపాటి రాజమోహన్‌రెడ్డికి సన్నిహితుడుగా ఉండడంతో అప్పట్లో ఆపార్టీ జిల్లా అధ్యక్షుడుగా నియమించారు. కొద్ది రోజులు ఆ పదవిలో కొనసాగారు. గూడూరు ఎసిసి నియోజకవర్గం కావడంతో అక్కడ నుంచి పోటీచేయాలనే ఉద్దేశ్యంతో 2014 ఎన్నికల్లో ఆ నియోజకవర్గంలో . వైసిపి అభ్యర్థిగా ఆయనే ఉంటారని అందరూ భావించారు. అప్పట్లో ఆపార్టీ నుంచి పాశం సునీల్‌కుమార్ అభ్యర్థిగా రావడంతో ఆయనకు అవకాశం దక్కలేదు. గెలిచిన తర్వాత పాశం సునీల్‌కుమార్ కొద్ది రోజుల తర్వాత టిడిపిలో చేరారు. అక్కడ వైసిపికి ఎవ్వరూ లేకపోవడంతో మేరిగ మురళీ గూడూరు నియోజకవర్గ మొత్తం గడప గడపకు తిరిగారు.


మేరిగ మురళిని అభినందిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

2019 ఎన్నికల్లో అభ్యర్థి ఆయనే అనుకునే సమయంలో ఎంఎల్ఎ అభ్యర్థిగా వరప్రసాద్‌ను అధిష్టానం ప్రకటించింది. ఆ సమయంలో పార్టీ నుంచి గుర్తింపు ఉంటుందని, ప్రత్యేక అవకాశాల దృష్ట్యా సీటు ఇవ్వలేకపోయానని వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు తెలిసింది. అందులో భాగంగా నేడు స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా మేరిగ మురళికి అవకాశం కల్పించారు. ముఖ్యమంత్రి ఇప్పటికే ఆయనకు చెప్పినట్లు తెలిసింది. అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. తనను ఎంఎల్‌సి అభ్యర్థిగా ఎంపిక చేశారని తెలిసిన వెంటనే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ ఎంఎల్‌సి టికెట్ కోసం వైసిపిలో అనేక మంది ప్రయత్నాలు చేశారు. నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్, ఎంపిపి ఛైర్మన్ సుకుమార్‌రెడ్డి, ఆనం విజయకుమార్‌రెడ్డి, రూప్‌కుమార్‌యాదవ్, వంటి వారు ప్రయత్నాలు చేసినట్లు తెలిసింది. అందరికీ ఏదో ఒక పదవి ఉండడం, ఏ పదవి లేకుండా ఉన్న మురళికే అధిష్టానం అవకాశం కల్పించింది.

22న నామినేషన్‌దాఖలు..!

నెల్లూరు స్థానిక సంస్థల ఎంఎల్‌సి అభ్యర్థిగా మేరిగ మురళీ ఈనెల 22న కలెక్టరేట్‌లో నామినేషన్ దాఖలు చేయనున్నారు. నామినేషన్ దాఖలు చేయడానికి ఈనెల 26న చివరి తేదీ. మార్చి 13న పోలింగ్ జరుగుతుంది. మార్చి 16న ఓట్లు లెక్కింపు ఉంటుంది. ఇదిలా ఉంటే వైసిపి స్థానిక సంస్థల్లో 95 శాతం ఫలితాలు సాధించింది. ప్రతిపక్షాల నుంచి నామినేషన్ వేసే అవకాశాలు కనిపించడం లేదు. 22 నామినేషన్ దాఖలుచేయనున్నారు. ఎవ్వరూ నామినేషన్ వేయకపోతే ఏకగ్రీవంగా మురళి ఎంఎల్‌సిగా ఎన్నిక అవుతారు. ఒక వేళ ఎవరైనా నామినేషన్ వేస్తే పోలింగ్ జరుగుతుంది.


పరీక్ష కేంద్రంలోకి క్యూలో వెళ్తున్న పరీక్షార్థులు

ప్రశాంతంగా ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్ష

ప్రజాశక్తి-నెల్లూరు

జిల్లాలోని 16 కేంద్రాల్లో ఎపిఎస్‌ఎల్‌పిఆర్‌బి నిర్వహించిన ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ పరీక్షలకు హాజరయ్యేందుకు 7,835 మందికి గాను 987 మంది గైర్హాజరు కాగా, 6,845 మంది పరీక్ష రాసినట్లు నిర్వాహకులు వెల్లడించారు. ఈ పరీక్షలు ఎస్పి సిహెచ్ విజయారావు పర్యవేక్షణలో నగరంలోని డికెడబ్ల్యు, గీతాంజలి , నారాయణ ఇంజనీరింగ్, జగన్స్ తదితర కళాశాలల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 02.30 గంటల నుంచి సాయంత్రం 05. 30 గంటల వరకు రెండవ పేపరుకు పరీక్షలు ప్రశాంత వాతా వరణంలో నిర్వహించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ట్రాఫిక్ కు అంతరాయం లేకుండా ఉండేలా సంబంధిత పోలీసు అధికారులకు తగు సూచనలు అందజేశారు.

సర్టిఫికెట్లు అందజేయాలి

ప్రజాశక్తి-నెల్లూరు : పెన్షనర్లు తమ లైఫ్ సర్టిఫికేట్లను ఈ నెల 28వ తేదీలోగా అందజేయాలని, ఈ సర్టిఫికెట్ అందజేయకపోతే పెన్షన్ నిలిచిపోయే ప్రమాదం ఉందని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌.ఎం.గౌస్ పేర్కొన్నారు. ఆదివారం భక్తవత్సలనగర్ ప్రాంతంలోని పెన్షనర్ల సంక్షేమ సంఘం అసోసియేషన్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కోవూరు సబ్‌ట్రెజరీ అధికారి పి.కిరణ్‌కుమార్, పొదలకూరు సబ్‌ట్రెజరీ అధికారి ఎస్‌కె కాలేషా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్‌ఎం గౌస్ మాట్లాడుతూ పెన్షనర్స్ జిఆర్ బకాయి, పిఆర్‌సి బకాయి వంటి సమస్యలు అపరిష్కృతంగా ఉన్నాయన్నారు. కావలి యూనిట్ అధ్యక్షులు ఎ.రమణయ్య , బుచ్చిరెడ్డి పాళెం యూనిట్ అధ్యక్షులు మాల్యాద్రి మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యలు, వాటి పరిష్కారానికి చేయాల్సిన పోరాటాలను వివరించారు.

వేతనాల చెల్లింపుపై

శ్వేతపత్రం విడుదల చేయాలి

పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లురెడ్డి



మాట్లాడుతున్న మీగడ వెంకటేశ్వర్లురెడ్డి

ప్రజాశక్తి-నెల్లూరు : ఉపాధ్యాయులు, ఉద్యోగుల జీతాలు సక్రమంగా చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేయడం తగదని, వేతన చెల్లింపుల్లో చోటు చేసుకుంటున్న జాప్యానికి గల కారణాలేమిటో ప్రభుత్వం తక్షణమే శ్వేతపత్రం విడుదల చేయాలని పిడిఎఫ్ పట్టభద్రుల ఎంఎల్‌సి అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లురెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమా వేశంలో ఆయన మాట్లాడారు. గతంలో అధికారంలో ఉన్న ఏ ప్రభుత్వాలు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు జీతాలు చెల్లింపులో అలసత్వం ప్రదర్శించలేదన్నారు. ఈ ప్రభుత్వ హయాంలోనే ఎప్పుడూ లేని విధంగా 20 వ తేదీ వరకు జీతాలు దశల వారీగా చెల్లిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు,ఉద్యోగుల పిఎఫ్, ఎపిజి ఎల్ఐ, సిపిఎస్ ఖాతాలలో వారు చెల్లిస్తున్న డబ్బులు జమ చెయ్యకుండా వాటిని ప్రభుత్వం పక్కదారి పట్టించే అధికారం ప్రభుత్వానికి ఎక్కడిదన్నారు. ఇది ప్రభుత్వ ఆర్థిక క్రమశిక్షణారాహిత్యానికి నిదర్శనమన్నారు. పెన్షనర్లకు, పిఆర్‌సి అరియర్లకు మూడు వాయిదాలలో చెల్లిస్తామని ప్రకటించినప్పటికీ ప్రభుత్వం నేటికీ ఆ ఊసే ఎత్తడంలేదన్నారు. కరువు భత్యం బకాయిలు 7 వాయిదాలు గత 4 సం లుగా వైసిపి ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిందన్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించే సరెండర్ సెలవులు, సంపాదిత సెలవులు ఎప్పుడు చెల్లిస్తారన్నది ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు అంతు చిక్కని ప్రశ్నగా మిగిలిపోయిందన్నారు. పాదయాత్రలు చేసే సమయంలో సి పి యస్ రద్దు చేస్తామంటూ హామీ ఇచ్చి నేడు సాధ్యం కాదని ఒకసారి, జి పి యస్ విధానం అమలు చేస్తామని మరో సారి ప్రభుత్వం ప్రకటించడం శోచనీయమన్నారు. ఓపిఎస్ అమలు చేయడం రాష్ట్రాల అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వానికి సాధ్యం కాకపోతే పంజాబ్, రాజస్థాన్ ,ఛత్తీస్ గడ్, హిమాచల్ ప్రదేశ్, ఝార్ఖండ్ లలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలకు ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని ప్రశ్నించే గొంతుక ఎంతో అవసరమని, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, నిరుద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులకు గ్రాడ్యుయేట్ లు అందరూ మీ అమూల్యమైన మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పిలుపు నిచ్చారు.

'తలమంచి'కి పరామర్శ

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు మండలంలోని కోవెదపాళెం సర్పంచ్, వైసిపి జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్ర బాబును వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి ఆదివారం పరామర్శించారు. ఇటీవల తీవ్ర అస్వస్థతకు గురైన సురేంద్ర బాబును తొలుత నెల్లూరు అపోలోలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం సురేంద్ర బాబును చెన్నై అపోలో ఆస్పత్రికి మంత్రి కాకాణి చొరవతో తరలించారు. ఇంటర్నేషనల్ కార్డియాలజిస్టు డాక్టర్ సాయి సతీష్ ఆయనకు మెరుగైన చికిత్స అందించారు. కేవలం రెండు రోజుల్లో సంపూర్ణ ఆరోగ్యంతో సురేంద్ర బాబు ఇంటికి చేరుకున్నారు. అనంతరం మంత్రి గోవర్ధన్ రెడ్డి ఇంటికి వెళ్లి సురేంద్ర బాబును పరామర్శించారు. సురేంద్ర బాబుకు అవసరమైన వైద్య ఖర్చులను మంత్రి భరించినట్లు సురేంద్ర బాబు పేర్కొన్నారు. వైసిపి కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, వైసిపి నాయకులు ఇసనాక రమేష్ రెడ్డి, ఆకుల మధు ఉన్నారు.



ప్రజలకు అండగా ప్రభుత్వం : కాకాణి

ప్రజాశక్తి-తోటపల్లిగూడూరు సిఎం జగన్మోహన్ రెడ్డి పరిపాలన పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారనిమంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. తోటపల్లి గూడూరు మండలం నరుకూరులో ఆదివారం "మా నమ్మకం నువ్వే జగన్" కార్యక్రమం జరిగింది. మంత్రి కాకాణి మాట్లాడుతూ దేశంలో ఏముఖ్యమంత్రి అమలు చేయని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వివిధ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నార న్నారు. ఎన్నికల సమయంలో మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలన్నింటిని నెరవేరుస్తూ, అన్ని విధాల ప్రజలకు అండగా నిలుస్తున్న జగన్మోహన్ రెడ్డి పాలన పట్ల, ప్రతి ఒక్కరూ నాటికి నూరు శాతం సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి గోవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వినూత్నంగా "గడప గడపకు మన ప్రభుత్వం" కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మంత్రి తెలిపారు. వైసిపి మండల కన్వీనర్ ఉప్పల శంకరయ్య గౌడ్, ఎంపీపీ స్వర్ణలత, ఇసనాక రమేష్ రెడ్డి,ఎంపిటి డైరెక్టర్ మన్నెం సుబ్రహ్మణ్యం గౌడ్, వెలిపర్తి శ్రీనివాసులు గౌడ్, వేగూరు శ్రీనివాసులు, కావలి రెడ్డి రంగారెడ్డి, ఉడా కిషోర్, నవీన్ ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి -రాపూరు : మండలంలోని గుండవోలుకు చెందిన గంగోడి ప్రతాప్, వారి కుమార్తె, కుమారుడు, ఇటీవల రోడ్డు ప్రమాదంలో మతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం ప్రముఖ పారిశ్రామికవేత్త పాపకన్ను మధుసూదన్ రెడ్డి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. ఆ కుటుంబానికి రూ. 50 వేలు ఆర్థిక సాయం చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త పాపకన్ను మధుసూదన్ రెడ్డి రాపూరు మండలం జేసిఎస్ కన్వీనర్ దందోలు లక్ష్మీనారాయణరెడ్డి,తో పాటు వారి వెంట సర్పంచ్, పింగాణి విశ్వనాథరెడ్డి,బొద్దు మధుసూదన్ రెడ్డి, రామకూరు నాగ సింహారెడ్డి, ఏపూరు సుబ్బారెడ్డి, కలపాటి మధుసూదన్ రెడ్డి, బత్తిన సంజీవరెడ్డి, వెలుగొండ సుబ్బరామిరెడ్డి పాల్గొన్నారు.



ఆరాధన మహోత్సవాలు

ప్రజాశక్తి -పొదలకూరు : పంచాయతి పరిధిలోని దేవనీరి క్షేత్రం (విట్టేపల్లితిప్ప) పై వెలసియున్న భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ప్రథమ శిష్యులు భగవాన్ నారాయణ స్వామి 15వ ఆరాధన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. గుండ్రా జనార్దన్ రెడ్డి, వసుంధర దంపతుల ఆధ్వర్యంలో నిర్వహించారు. టి ప్రభాకర్, విజయలక్ష్మి, రామ్మోహన్ రెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాసులు ఉన్నారు.

నేత్రపర్వంగా ఉత్సవం

పొదలకూరు : మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు భాగంగా స్థానిక కామాక్షి తాయి రామలింగేశ్వర స్వామి వారి ఆదివారం పొదలకూరు పురవీధుల్లో దేవేరీల గిన్నెలీల నేత్రపర్వంగా సాగింది. తమ ఇళ్ల వద్దకు ఉంచిన స్వామి వారికి భక్తులు కాయ కర్పూరం సమర్పించి, గిన్నెలో భిక్ష వేశారు. శివాలయ ప్రధాన అర్చకులు పి బి ఎస్ వి ప్రసాద్ స్వామి తెలిపారు. మాట్లాడారు. బ్రాహ్మణ సంఘం నాయకులు పి బి ఎస్ వి ప్రసాద్ స్వామి, మాచవోలు రాజశేఖర్ ,బి.గోపాల కృష్ణ మాచార్యులు, కృష్ణమూర్తి, సిహెచ్ ప్రసాద్ లు ఉభయకర్తలుగా వ్యవహరించారు. శివ స్వామి, కుమారస్వామి, రమేష్, మనోహర్ స్వాములు, చైతన్య పాల్గొన్నారు.

గుడ్లూరులో అన్నదానం

ప్రజాశక్తి -గుడ్లూరు : మహాశివరాత్రి సందర్భంగా గ్రామస్తులు కొండరు పోటాపోటీగా శివరాత్రి అన్నదానం చేశారు. గాంధీ బొమ్మ సెంటర్లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మ్యాంగో రైస్ మజ్జిగ అందరికీ సరఫరా చేశారు. మిట్టపాలెంలో ఉన్న అంకమ్మ దేవాలయం గుడి ఆవరణంలో భారీ ఎత్తున అన్నదాన నిర్వహించారు.సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించండి..!


ప్రచారం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి -నెల్లూరు

ఎంఎల్‌సి ఎన్నికల్లోపిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ విస్తృత ప్రచారం చేస్తున్నారు. మార్చి 13వ తేదీన జరగనున్న శాసనమండలి ఎన్నికలకు సంబంధించి జిల్లాలో ప్రచార హోరు జోరందుకుంది. వైసిపి, పిడిఎఫ్ అభ్యర్థులు పోటా పోటీగా ప్రచారాలు నిర్వహిస్తూ తమ గెలుపుకు అనుకూలంగా ఓటర్లను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం ఉదయం నగరంలోని చిల్డ్రన్స్ పార్కులో పిడిఎఫ్ శాసనమండలి పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లు రెడ్డి,ఉపాధ్యాయుల అభ్యర్థి బాబు రెడ్డిలు సంయుక్తంగా తమ ప్రచార కార్యక్రమం నిర్వహించారు. పిడిఎఫ్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి వెజాలిటీతో అత్యధిక గెలిపించాలంటూ ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ప్రజా సంఘాల నాయకులు కాయం శ్రీనివాసులు, పి.సూర్యనారాయణ, కట్టా సతీష్, అల్లంపాటి శ్రీనివాసరెడ్డి , జెకె పాజి, విద్యాధరణ్, సింగారెడ్డి మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంఘాల ఆధ్వర్యంలో...

21వ డివిజన్ సిపిఎం శాఖ డివైఎఫ్ఐ, నెల్లూరు జిల్లా ఆటో కార్మిక సంఘం అనుబంధం (సిఐటియు) ఆధ్వర్యంలో నిరంతరం ప్రజల,ఉద్యోగుల సమస్యలపై పోరాడే నాయకులు పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలుపుకోసం రవీంద్రనగర్, ఉమ్మారెడ్డి గుంట ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఎంఎల్‌సి ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థులు (గ్రాడ్యుయేట్) అభ్యర్థి మీగడ.వెంకటేశ్వర్లురెడ్డి,(టీచర్స్) అభ్యర్థి పొక్కిరెడ్డి.బాబు రెడ్డి లకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంచిపెట్టారు ఈ కార్యక్రమంలో పార్టీ సభ్యులు మని, డివైఎఫ్ఐ నాయకులు మని, ఆటో కార్మిక సంఘం నాయకులు జనార్దన్, శ్రీను, మురళి తదితరులు పాల్గొన్నారు. 11వ డివిజన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం చేపట్టారు. నాయకులు పి .సూర్య నారాయణ, టి.నారాయణ, ఆవుల పెంచలయ్య, కర్రం బాబు, కత్తి చిన్న, కె.సుబ్బారావు, ఐ.శేషయ్య, ఆవుల ప్రశాంత్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.29, 31వ డివిజన్‌లలో రాజారాంరెడ్డి నగర్‌లో ప్రజాసంఘాలు ఎంఎల్‌సి ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

తారకరత్న మృతితో విషాదం..!

అల్లేఖ్యరెడ్డి స్వగ్రామం కోట - హైదరాబాద్ తరలిన బంధువులు


దుఃఖిస్తున్న అల్లేఖ్యరెడ్డి, బిడ్డలు, ఇన్‌సెట్లో తారకరత్న

ప్రజాశక్తి -నెల్లూరు ప్రతినిధి నందమూరి తారకరత్న మృతితో ఉమ్మడి నెల్లూరు జిల్లా కోట పట్టణంలో విషాద చాయలు అలుము కున్నాయి. తారకరత్న భార్య తూపిలి అల్లేఖ్యరెడ్డి స్వగ్రామం కోట. ఆడిటింగా రిటైర్డ్ అయిన అల్లేఖ్యరెడ్డి తండ్రి కోటలోని ఆకుతోటలోని అక్కడ పాత ఇల్లు ఉండగా, ఇటీవల గురుకుల పాఠశాల ప్రాంతంలో ఇంటిని నిర్మించు కున్నారు. ఉద్యోగరీత్యా అల్లేఖ్యరెడ్డి ఆనం తర్వాతలో స్థిరపడ్డారు. ఆమె చిన్నాన్నలు తూపిలి భాస్కర్‌రెడ్డి, తూపిలి విజయ కుమార్‌రెడ్డి ఇక్కడే ఉంటున్నారు. ఆమె బంధువులంతా దగా కోటలోనే ఉండడంతో శనివారం తారకరత్న మృతి వార్త తెలియగానే విషాదచాయలు అలుముకున్నాయి. విషయం తెలిసిన వెంటనే అల్లేఖ్యరెడ్డి బంధువులు పెద్ద ఎత్తున అంత్యక్రియల కోసం హైదరాబాద్ వెళ్లారు. అల్లేఖ్యరెడ్డి తెలుగు మాజీమంత్రి మన్నెం మాధవరెడ్డి కుమారుడుతో వివాహం జరిగింది. విడాకులు కావడంతో తర్వాత తారకరత్నను వివాహం చేసుకుంది.

విరాళం అందజేత

ప్రజాశక్తి -కందుకూరు : మచిలీపట్నం సమీపంలోని గూడూరులో 108 అడుగుల స్వూపానికి ఆదివారం లింగసముద్రం మండలం, రాళ్లపాడు చెందిన పరిపాటి కృష్ణారెడ్డి భార్య వరమ్మ రూ.1,00,000లు విరాళంగా ఎంఎల్ఎ మానుగుంట మహీధర్ రెడ్డి సమక్షంలో అందజేశారు. స్తూపం ఛైర్మన్, శాసనసభ్యులు మహీధర్ రెడ్డి మాట్లాడారు. బాబా పరమపదించి వందేళ్ళ అయిన సందర్భంగా స్తూపం నిర్మిస్తున్నారన్నారు. సూరం వేణుగోపాలరెడ్డి, కొండూరి వసంతరావు పాల్గొన్నారు.

అంకమ్మ తల్లి ఆలయానికి .. అంకమ్మ తల్లి ఆలయ పునర్నిర్మాణం ఎంఎల్ఎ మహీధర్ రెడ్డి, భక్తుల ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మాణ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఆలయ నిర్మాణం శరవేగంగా జరుగుతుంది. పాడాల వెంత ఉంచి సువర్ణ యంత్రానికి భక్తులు తమ వంతు బంగారాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పిస్తున్నారు. ఆదివారం పేర్నమెట్ట నిర్మల జ్ఞాపకార్థం భర్త నర్సింగారావు కుమారుడు మనోజ్ కుమార్ కోడలు వాసవి అమ్మవారి పాదాల చెంత బంగారు యంత్రం కోసం రూ .5816 విరాళంగాఆలయ నిర్మాణ కమిటీ సభ్యుడు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు మంచిరాజు మురళీమోహన్,ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

పెంచలకోన సందర్శన

ప్రజాశక్తి -రాపూరు : పెంచలకోనలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని రాపూరు మండల వైసిపి నాయకులు ఆదివారం దర్శించుకున్నారు. మహాశివరాత్రి పురస్కరించుకుని మాజీ మార్కెటింగ్ ఛైర్మన్ పాప కన్ను మధుసూదన్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు మన్నెం కృష్ణ కిషోర్ రెడ్డి, జెసిఎస్ కన్వీనర్ దందోలు నారాయణరెడ్డి కలపాటి మధుసూదన్ రెడ్డి, కేతు సుబ్బారెడ్డి ఒంకిమోలు ఉమామహేశ్వర్ రెడ్డి, దుగ్గిరెడ్డి నరసింహారెడ్డి బొద్దు మధుసూదన్ రెడ్డి, గద్దం వెంకటరమణారెడ్డి ,బొమ్మిరెడ్డి వెంకటరమణారెడ్డి, సత్తు నరసింహులు తదితరులు ఆలయాన్ని సందర్శించి పూజలు నిర్వహించారు.

భగ్గుమంటున్న టమోట ధరలు

కేజీ రూ. 20 నుంచి రూ. 32కు పెరిగిన వైనం

ప్రజాశక్తి -కందుకూరు

టమోటాల ధర రోజురోజుకు పెరుగుతుంది. నిన్న మొన్నటి వరకు కేజీ రూ. 20 నుంచి రూ. 22 ఉన్న టమోటా ధర ఒక్కసారిగా రూ. 32కు చేరింది. కేజీకి ఒక్కసారిగా రూ. 10 పెరగడంతో కొనుగోలు దారులు బెంబేలెత్తుతున్నారు. టమోటాల ధర ఇంకా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. వివిధ రకాల కూరగాయల ధరలు పెరిగిపోతున్నాయి. కేజీ వంకాయల ధర 20 రూపాయలు పలుకుతుండగా, రూ. 20 నుంచి బెండకాయలు ధర 50కు చేరింది. 20కాకరకాయలు ధర 33 రూపాయలకు చేరింది. బీరకాయలైతే అసలు కొనే పరిస్థితి లేదు. కేజీ రూ. 50 అమ్ముతున్నారు. బీన్స్ ధర కేజీ రూ. 60 ఉంది. కాలీఫ్లవర్ రూ. 60 ఉంది. రూ. గోరుచిక్కుల ధర రూ. 84 ఉది. కందుకూరు ప్రాంతంలో పండుతున్న కూరగాయలకు మాత్రం ధరాలు అతి తక్కువ ధర ఇస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.



తారకరత్నకు ఘన నివాళి




ప్రజాశక్తి -కందుకూరు : అనారోగ్యంతో చికిత్స పొందుతూ మతి చెందిన సినీనటుడు నందమూరి తారకరత్నకు టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరావు ఆధ్వర్యంలో తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. నేతలు మాట్లాడుతూ చిన్న వయసులోనే తారకరత్న మతి చెందటం బాధాకరమన్నారు. నారా లోకేష్ యువగళం పాదయాత్ర తొలి రోజున తారకరత్న ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారని, అప్పటినుంచి బెంగళూరులో చికిత్స పొందుతూ చనిపోవడం టిడిపి శ్రేణులను దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి ముచ్చు శ్రీను, రాష్ట్ర కమిటీ నాయకులు చిలకపాటి మధు, కూనం నరేంద్ర, నెల్లూరు పార్లమెంట్ కమిటీ నాయకులు గోచిపాతల మోషే ఉన్నారు.

ప్రజాశక్తి-గుడ్లూరు : తారక రత్న చికిత్స పొందుతూ మతి చెందడంపై మండల టిడిపి నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తారకరత్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మండల టిడిపి నేతలు పువ్వాడ వేణు, ఎం రామయ్య ,చెన్నారెడ్డి, మహేష్ ,ఉమ్మడిపూడి కోటేశ్వరావు, జనిగర్ల నాగరాజు ,రాజారు వేణు పాల్గొన్నారు.

తోటపల్లి గూడూరు : మండలంలోని నరుకూరులో టిడిపి నాయకులు, కార్యకర్తలు తారకరత్న చిత్ర పటం వద్ద నివాళులు అర్పించారు. ఎంపిటిసి సభ్యులు కొణతం రఘుబాబు మాట్లాడుతూ తారకరత్న మృతి బాధాకరమన్నారు. తారక రత్న ఆకుయ సాధనకు తాము కృషి చేస్తామని తెలిపారు. తారక రత్న కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తారక రత్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. టిడిపి నాయకులు, అభిమానులు, పాల్గొన్నారు.

47వ డివిజన్‌లో

'పవనన్న ప్రజా బాట'



ప్రజాశక్తి-నెల్లూరు : స్థానిక 47వ డివిజన్ పరిధిలోని కామాటి వీధిలో పవనన్న ప్రజాబాట కార్యక్రమాన్ని నగర నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు కేతంరెడ్డి వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆదివారం చేపట్టిన ఈ కార్యక్రమం 279వ రోజుకు చేరుకుంది. కేతంరెడ్డి వినోద్ రెడ్డి మాట్లాడుతూ కోవిడ్ తదనంతర పరిస్థితుల నేపథ్యంలో నెల్లూరు నగరంలో నివసిస్తున్న అనేకమంది స్వర్ణకారుల బ్రతుకులు కొలిమిలో కాలుతున్నాయని అన్నారు. అగ్గిలో ఇబ్బందులు పడుతున్న తమ జీవితాల్లో మార్పు రావడానికి ప్రభుత్వమే ఓ దారి చూపాలని స్వర్ణకారులు కోరుతున్నారన్నారు. విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ ఏర్పాటు చేసి అర్హులైన వారికి ఆర్థిక సాయం చేయాలని, నిధులు కేటాయించి స్వర్ణకారులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. స్వర్ణకారులకు వత్తి నైపుణ్యతను పెంపొంది ంచుకునేందుకు ప్రభుత్వం సహకరం చాలన్నారు. స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్మశాన స్థలంలో సర్వే

- ప్రజాశక్తి కథనానికి స్పందన


మాట్లాడుతున్న తహశీల్దార్

ప్రజాశక్తి-అల్లూరు

మండలంలోని పురిణి పంచాయతీ పరిధి కొత్తపాలెం గ్రామంలో ఆ క్రమంలో శ్మశానం అనే కథనాన్ని ప్రజాశక్తి ప్రచురించగా ఆదివారం తహశీల్దార్ శ్రీరామకృష్ణ వెంటనే స్పందించి మాట్లాడారు. వికలాంగ, సర్వేయర్‌ను పంపి ఆ స్థలాన్ని సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. గ్రామస్తులు ఇంతవరకు ఈ సమస్యను తన దృష్టికి తీసుకు రాలేదని వెల్లడించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారులు దృష్టికి తీసుకువచ్చారని తెలియజేశారు. ప్రజలకు అన్ని విధాల సేవలు అందించేందుకే తామున్నామన్నారు. ఎవరైనా అధికారులు దురుసుగా నిర్లక్ష్యంగా వ్యవహరించినా ఎప్పటికప్పుడు సమాచారమివ్వాలని కోరారు.

హమారా ప్రసాద్‌ను శిక్షించాలి



ప్రజాశక్తి-అల్లూరు : దళిత ద్రోహి తెలంగాణ రాష్ట్రానికి చెందిన హమారా ప్రసాద్‌ను మరణ శిక్షతో శిక్షించాలని దళితులు డిమాండ్ వ్యక్తపరిచారు. ఆదివారం మండల కేంద్రం స్థానిక బోర్డు స్కూల్ వద్ద అంబేద్కర్ జ్ఞాన బోధనలపై 3వ సభను ఏర్పాటు చేశారు. ముందుగా దళితులు ర్యాలీగా బయలుదేరి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదురుగా హమారా ప్రసాద్ దిష్టిబొమ్మను చెప్పులతో కొట్టుకుంటూ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా దళిత నాయకుడు పొంగులూరు ప్రసాద్ మాట్లాడుతూ ఆ రోజుల్లో నేను బతికి ఉంటే గాడ్సే లాగా అంబేద్కర్‌ను కాల్చి చంపుతానని ఆ ద్రోహి అనుచిత వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్, బిజెపి ముసుగులో ప్రపంచ మేధావిపై అవాకులు, చావాకులు పేలితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇప్పటికీ దేవాలయాల్లో ప్రవేశాల్లేక దళితులు అనేక అవమానాలు ఎదుర్కొంటున్నారని గుర్తు చేశారు. వేల సంవత్సరాలు ఊరికి దూరంగా ఉంచి మతోన్మాదులు పైశాచిక ఆనందాన్ని పొందారని అన్నారు. కార్యక్రమంలో ఎల్లు సాల్మన్ రాజు, పొంగులూరి శ్రీనివాసులు, దానం మాల్యాద్రి, కోవూరు శ్రీనివాసులు, బిల్లా మస్తానయ్య తదితరులున్నారు.

గురుకులంలో మెడికల్ క్యాంప్



ప్రజాశక్తి-ఉదయగిరి : మండల పరిధిలోని గండిపాలెంలో ఎపి గురుకుల పాఠశాలలోని విద్యార్థులకు ఆదివారం పూర్వ విద్యార్థులు ఎఎజి మెడికల్ క్యాంప్ నిర్వహించారు. డాక్టర్ కొప్పల తిరుపతి ఆధ్వర్యంలో చర్మం, గొంతు థైరాయిడ్ సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అపూర్వ విద్యార్థులు మాట్లాడుతూ కష్టపడి చదివితే ఉన్నత స్థాయికి చేరవచ్చని తల్లిదండ్రులతోపాటు గ్రామానికి మంచిపేరు వస్తుందన్నారు. ఇలా సేవలు అందించడం పూర్వ విద్యార్థులుగా ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి మురళీకృష్ణ, పూర్వ విద్యార్థులు ఎఎజి సంస్థ సెక్రెటరీ రసూల్, వైస్ ప్రెసిడెంట్ సుమన్ హాస్పిటల్ సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

అన్నపూర్ణ సేవలు ఎనలేనివి..



ప్రజాశక్తి-కావలి : కావలి ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ లంకా అన్నపూర్ణశ్రీ అనేక కేసులకు గొప్ప, గొప్ప తీర్పులు ఇచ్చి, న్యాయవ్యవస్థకే వన్నె తెచ్చారని ప్రముఖన్యాయవాది, మాజీ ఎ.జి.పి. పొట్లూరు శ్రీనివాసులు కొనియాడారు. అన్నపూర్ణశ్రీ కావలి నుండి విజయవాడకు బదిలీ అయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ఆమెను ఆదివారం పొట్లూరు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఆమె ఎన్నో పెండింగ్, మొండికేసులను పరిష్కరించడంలో ఎంతో చొరవ చూపారన్నారు. కష్టపడే మనస్తత్వమున్న ఆమెతన జీవితంలో మరెన్నో ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

కెవిపిఎస్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-దగదర్తి : మండల పరిధిలోని తురిమెళ్ల పంచాయతీలోని అరుంధతీయవాడలో 14 మందితో కెవిపిఎస్ నూతన కమిటీని ఎన్నికైంది. అధ్యక్షుడిగా కాకులూరు మధు, కో కన్వీనర్ కాకిపర్తి హరి, ఎన్నుకయ్యారు. కార్యక్రమంలో కర్ర పోలయ్య, ఒంటేరు సుధాకర్, పోతంశెట్టి విద్యాచరణ్, విజయ్, గిరి, మంద సేనయ్య, మంద మహేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న టిడిపి నేతలు

తారకరత్నకు ఘన నివాళులు

ప్రజాశక్తి-కావలి : నందమూరి తారకరత్న అకాల మరణానికి చింతిస్తున్నామని ఆదివారం కావలి పట్టణ ఏరియా ఆసుపత్రి ఎదురుగా కావలి టిడిపి తరపున భారీ సంఖ్యలో పాల్గొన్న అభిమానుల మధ్య నివాళులుఅర్పించారు. ఈ కార్యక్రమంలో కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాలేపాటి సుబ్బానాయుడు హాజరై, చిత్రపటానికి పూలు వేసి ఘనమైన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తారకరత్న ఇక లేడనే వార్త మనసును తొలిచివేసిందని, టిడిపి కుటుంబ సభ్యులు, నందమూరి వంశ అభిమానులు ఈ విషయాన్ని జీర్ణించుకోవడం కష్టంగా ఉందన్నారు. ఆయన మరణం పార్టీకి తీరని లోటని, వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అన్నపూర్ణ, శ్రీను, పోతుగంటి శ్రీకాంత్, చవల రామకృష్ణ, రఫీ, తటవర్తి వాసు, మంచాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-కలిగిరి : నందమూరి తారకరత్న అకాల మరణానికి చింతిస్తూ ఆయనకు శాంతి చేకూరాలని టిడిపి క్యాంపు కార్యాలయంలో మండల నాయుకులు ఆదివారం నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బిజ్జం కృష్ణారెడ్డి మాట్లాడుతూ సినీ నటుడు, మాజీ ముఖ్యమంత్రి ఎన్ టి రామారావు మనవడు నందమూరి తారకరత్న శనివారం మృతి చెందడం నందమూరి కుటుబానికి పార్టీకి తీరని లోటు అని అన్నారు. 23 రోజులుగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆరోగ్యం మెరుగవుతుందనుకుంటున్న దశలో మృత్యువుకు చేరువ కావటం బాధాకరమన్నారు. తారకరత్న కుటుంబ సభ్యులకు ఉదయగిరి నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు చాగంటి జయరామిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కాకు మహేష్, సర్పంచులు పూసాల వెంగపనాయుడు, మాధవ, వర ప్రసాద్ రావు, ఎస్‌సి నాయుకులు బోగ్గవరపు వేణు, కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా.. ఇద్దరికి గాయాలు


ప్రమాదానికి గురైన ఆటో

ప్రజాశక్తి-ఉదయగిరి : మహాశివరాత్రికు సిద్ధేశ్వరం క్షేత్రానికి వెళ్లి తిరుగు ప్రయాణంలో ఆటో బోల్తా పడి ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన ఉదయగిరి మండలం గండిపాలెం సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. మహాశివరాత్రి సందర్భంగా శివరాత్రి జాగరణ కోసం పప్పుల వారి పల్లి గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన 12 మంది సొంత ఆటోలో సీతారామపురం మండలం ఘటిక సిద్ధేశ్వర క్షేత్రానికి వెళ్లి రాత్రంతా అక్కడే బస చేసి తిరిగి స్వగ్రామానికి వెళ్లే సమయంలో గండిపాలెం సమీపానికి వచ్చేసరికి అడ్డుగా వస్తున్న కుక్కను తప్పించబోయి ఆటో బోల్తా పడిందన్నారు. ఈ ప్రమాదంలో సుజిత్ 14 సిద్ధు 18 అనే ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయని సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన ఇద్దరినీ స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కొరకు నెల్లూరు వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

పిడిఎఫ్ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయండి


ఆత్మకూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న మూలం రమేష్

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

ప్రభుత్వ ఉద్యోగస్తులను ప్రశ్నించే హక్కు కూడా లేకుండా గట్టి ప్రయత్నం చేస్తుందని ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక సమస్యల కోసం శాసనమండలిలో గళం విప్పడం కోసం పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించుకోవడం ఎంతో అవసరమని ప్రజాసంఘాల నాయకులు మూలం రమేష్ పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలోని కార్యాలయంలో ప్రజా సంఘాలు, ఉద్యోగ ఉపాధ్యాయ ప్రయివేట్ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో ఉద్యోగ సంఘాలు దుర్భర పరిస్థితులు ఎదుర్కోబోతున్నారని తెలిపారు. దీనిని తిప్పి కొట్టాలంటే పిడిఎఫ్ ఎంఎల్‌సి పట్టభద్రుల అభ్యర్థి మీగడ వెంకటేశ్వర్లురెడ్డి, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థి పోక్కిరెడ్డి బాబురెడ్డిలను గెలుపు కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వంద్ర రాజగోపాల్ మాట్లాడుతూ శాసనమండలిలో పెద్దల సభకు శాసనమండలిలో రాజకీయాలు తీసుకొచ్చి ఒక్కొక్కరు రూ.20, 30 కోట్లు డబ్బు ఖర్చుపెట్టి కార్పొరేట్ తెలుసుకోవడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. దొంగ ఓట్లు వేసుకొని గెలిచే దానికి ప్రయత్నాలు జరుగుతూ ఉంటాయని వ్యాఖ్యానించారు. అలా జరగకుండా ఉండాలంటే గట్టి ప్రయత్నం చేయాలని సూచించారు. పిడిఎఫ్ అభ్యర్థుల తరపున ఇప్పటివరకు ఏడు మంది గెలిచారని, మొత్తం ప్రజాసమస్యల ఏవైనే ఉన్నాయో ఆ సమస్యలన్నింటినీ శాసనమండలిలో సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తూ వస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేసే ఉద్యోగ, ఉపాధ్యాయ, విద్యార్థులకు విద్యా వ్యవస్థ, కార్మికులకు ప్రభుత్వం ఏ తప్పు చేసిన ప్రశ్నించేవారు పిడిఎఫ్ అభ్యర్థులని తెలియజేశారు. మేధావులు ప్రొఫెసర్ నాగేశ్వరరావు, విఠపు బాలసుబ్రమణ్యం లాంటి వారు ప్రశ్నించే గళమెత్తేలా గెలిచారన్నారు. ఉద్యోగుల సిపిఎస్ గురించి విజయవాడ సభకు మారు వేషాలతో వెళితే పోలీసులు ఎంతో దుర్మార్గంగా ప్రవర్తించిన తీరును అందరూ గుర్తు తెచ్చుకోవాలన్నారు. అలాంటి పరిస్థితులు ఉత్పన్నం కాకుండా ఉండాలంటే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులను గెలిపించుకుని తీరాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు జె శివప్రసాద్, మండల కార్యదర్శి కొండమూరి హజరత్తయ్య, పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, జిల్లా కౌలు రైతు సంఘం నాయకులు, గంట లక్ష్మీపతి, మూలి వెంగయ్య, యుటిఎఫ్ నాయకులు శివప్రసాద్, ఎల్ఐసి యూనియన్ నాయకులు రమేష్, ఆర్‌టిసి యూనియన్ నాయకులు మహమ్మద్‌అలీ, ఆవాజ్ రాష్ట్ర నాయకులు ఎస్థాని, రిటైర్ ఉపాధ్యాయులు ఎల్.కృష్ణ ప్రసాద్, శ్రీరాములు, నాయకులు ఆళ్ళ హజరత్తయ్య, తదితరులున్నారు.



ప్రజాశక్తి-అల్లూరు : ప్రభుత్వ భవనాలు, విద్యార్థులకు నాణ్యమైన విద్య కావాలంటే పిడిఎఫ్ ఎంఎల్‌సి అభ్యర్థులైన మీగడ వెంకటేశ్వర్లు రెడ్డి, పోక్కిరెడ్డి బాబురెడ్డిని గెలిపించాలని ప్రజాసంఘం నాయకులు పాటి భాస్కర్ పిలుపునిచ్చారు. ఆదివారం మండల కేంద్రం బస్వారెడ్డి శంకరయ్య భవనంలో మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎన్నికలకు ఎన్నడూ లేని విధంగా రాజకీయ రంగు పులిమి పార్టీలు పబ్బం గడుపుతున్నాయని ఎద్దేవా చేశారు. గతంలో పిడిఎఫ్ అభ్యర్థులు గెలుపొంది శాశ్వత భవనాలను కట్టించి విద్యా హక్కుల కోసం అనేక పోరాటాలు సాగించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు షేక్ అబ్దుల్‌రషీద్, రఘురాం రెడ్డి, విజయలక్ష్మి, వెంకయ్య, రమణయ్య, ఆదెయ్య తదితరులున్నారు.

ప్రజాశక్తి-కావలి : స్థానిక బుడంగుంట ఎస్‌సి కాలనీ, ఇందిరమ్మ కాలనీలో ఆదివారం పి.డి.ఎఫ్. ఎంఎల్‌సి అభ్యర్థుల గెలుపునకు ప్రజాసంఘాల నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు ఓటర్లను కలిసి పిడిఎఫ్ తరుపున



పట్టభద్రుల ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న మీగడ వెంకటేశ్వరరెడ్డికి మీ మొదటి ప్రాధాన్యత ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయ ఎంఎల్‌సిగా పోటీ చేస్తున్న పొక్కిరెడ్డి బాబురెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పసుపులేటి పెంచలయ్య, బి.కృష్ణయ్య, కె చెన్నయ్య, డి.వై.ఎఫ్.ఐ నాయకులు పి.కోటేశ్వరరావు, ఎస్.ఎఫ్.ఐ. నాయకులు రాకేష్, తదితరులున్నారు.



ప్రజాశక్తి-నెల్లూరు : నిరంతరం ప్రజలు, ఉద్యోగుల సమస్యలపై పోరాడే నాయకులు పిడిఎఫ్ అభ్యర్థులను గెలిపించాని ఆది వారం ప్రజాసంఘాల నాయకులు 11వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రాడ్యుయేట్ అభ్యర్థి మీగడ. వెంకటేశ్వర్లురెడ్డి, టీచర్స్ అభ్యర్థి పొక్కిరెడ్డి. బాబురెడ్డిలకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి గెలిపించాలని కోరుతూ ఆ డివిజన్ పలు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు పి.సూర్య నారాయణ, టి.నారాయణ, ఆవుల.పెంచలయ్య, కర్తం.బాబు, కత్తి.చిన్న, కె.సుబ్బారావు, ఐ.శేషయ్య, ఆవుల. ప్రశాంత్, ప్రణీత్ పాల్గొన్నారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఆలయ చైర్మన్ సూర్య నారాయణ

బండలాగుడు పోటీలు

ప్రజాశక్తి-వరికుంటపాడు

మండల పరిధిలోని పెద్దిరెడ్డిపల్లిలో శివరాత్రి పండుగ సందర్భంగా ఆదివారం ఎడ్ల బండలాగుడు పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను ఆలయ ప్రతిష్టాపకులు పెండ్యాల సూర్యనారాయణ ప్రారంభించారు. కడప జిల్లా కాశినాయన మండలం నరసాపురం గ్రామానికి చెందిన కామిని వెంకటసాయి ప్రతాపరెడ్డి ఎడ్లు ప్రథమ స్థానంలో నిలువగా కాంగ్రెస్ పార్టీ ఉదయగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దుద్దుకూరి రమేష్‌నాయుడు రూ.30 వేలను బహుమతిగా అందజేశారు. అలాగే ప్రకాశం జిల్లా పెద్ద అరవీడు మండలం సుంకేసుల గ్రామానికి చెందిన ముద్ద పార్టీ శ్రీనివాసులు ఎడ్లు ద్వితీయ స్థానంలో నిలువగా రూ 25 వేలను ఆలయ చైర్మన్ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు పెండ్యాల సూర్యనారాయణ అందజేశారు. మండలంతోపాటు పరిసర మండలాల్లోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు వచ్చి పోటీలను ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పెండ్యాల సూర్యనారాయణ మాట్లాడుతూ మూడు రోజులుగా జరుగుతున్న శివరాత్రి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయన్నారు. 11 ఏళ్లుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారని శివపార్వతుల కళ్యాణం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేయడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ పోటీల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉదయగిరి ఎస్ఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-అల్లూరు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రం టిటిడి కళ్యాణ మండపంలో మా నమ్మకం నువ్వే జగన్ అనే కార్యక్రమం ద్వారా వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాసేవ చేసేందుకు గృహసారథులు కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఒక వాలంటీర్‌కి ఇద్దరు గృహసారథులు అందుబాటులో ఉంటారని తెలిపారు.రాష్ట్రంలో జగనన్న ఒక పెద్ద కుటుంబాన్ని ఏర్పాటు చేసినట్లు, అందులో వాలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గహ సారథులు అంతా కలసి 8 లక్షల మంది ఉన్నారని హర్షం వ్యక్తం చేశారు. జగన్మోహన్ రెడ్డి అభివృద్ధే ధ్యేయంగా భావించి పేద ప్రజల కోసం విస్తృతంగా పథకాలు ప్రవేశపెడుతున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి చెప్పినవి, చెప్పనివి పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలను అన్ని వర్గాల ప్రజలకు పంచుతున్నారని తెలియజేశారు. గడప గడప కార్యక్రమంలో భాగంగా ఇళ్ల వద్దకు వెళితే వాలంటీర్ లు వచ్చి 1వ తారీఖున 5 గంటలకే పింఛన్ అందజేసి వెళ్తున్నట్లు అవ్వ,తాతలు ఆనందం వ్యక్తపరిచారన్నారు. సీనియర్ నాయకులు నీలం సాయికుమార్ మాట్లాడుతూ నగర పంచాయతీ కారణంగా సింగపేట, అల్లూరు, నార్త్ మోపూరు పంచాయతీలలో ఎస్‌సి ఎస్‌టి పాపులేషన్ అధికంగా ఉందని ఈ కారణంగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని వివరించారు. ఒక పంట లేక 2 పంటలు ఉంటాయని పనులు లేని సమయంలో ఉపాధి హామీ పనుల ద్వారా జీవనం సాగించే వారని తెలిపారు. నగర పంచాయతీతో ఉపాధి లేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని ఎంఎల్ఎ దృష్టికి తీసుకొచ్చి వినతిపత్రం సమర్పించారు. ఎంఎల్ఎ వెంటనే స్పందించి ఇప్పటికే మున్సిపల్ మంత్రికి సంబంధిత విషయాన్ని తెలియజేశారన్నారు. సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పంచాయతీలుగా చేసే బాధ్యత తనదంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర జెఎసిఎస్ కన్వీనర్ శివ శంకర్ రెడ్డి, మండల కన్వీనర్ దండా కృష్ణారెడ్డి, ఎఎంసి వైస్ ప్రెసిడెంట్ ఊటు శ్రీకాంత్ రెడ్డి, జెడ్‌పిటిసి చలంచర్ల వీణమ్మ, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, మండల ఉపాధ్యక్షులు గుమ్మడి సురేంద్ర, నాయకులు కోడూరు సాధకుమార్ రెడ్డి, మేడా శ్రీనివాసులు రెడ్డి, బీద రమేష్ యాదవ్, కొండూరు శ్రీనివాసులు, నార్త్ ఆములూరు సర్పంచ్ షేక్ కరిముల్లాషా ఖాదర్ తదితరులున్నారు.

ఎంబిబిఎస్ విద్యార్థినికి సన్మానం

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్



ఆత్మకూరు పట్టణానికి చెందిన కానిస్టేబుల్ చెన్నకేశవులు కుమార్తె లల్లిత ఎంబిబిఎస్ ఫ్రీ సీట్ సాధించడంతో ఆదివారం స్థానిక 20వ వార్డు కౌన్సిలర్ సూరా భాస్కర్ రెడ్డి, ఆధ్వర్యంలో లలితకు ఘనంగా విద్యార్థి లలితకు శాలువా కప్పి సన్మానించారు. ప్రయివేట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఒంటరి మల్లికార్జున విద్యార్థి తల్లిదండ్రులున్నారు.

అక్రమంగా ప్రహరీ గోడ నిర్మాణం

ప్రజాశక్తి-కావలి

స్థానిక మన్నంగిదిన్నె గిరిజన కాలనీ, కావలి మాలపాలెం, ఇందిరమ్మ కాలనీలలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు అక్రమంగా నిర్మిస్తున్న ప్రహరీ గోడల నిర్మాణాలని "ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక" బృందం ఆదివారం స్వయంగా పరిశీలించింది. స్థానిక ప్రజలతో మాట్లాడింది. తమ రియల్ ఎస్టేట్ వెంచర్ల పక్కన గిరిజన కాలనీ ఉంటే తమ ప్లాట్లు అమ్ముడుపోవని, గిరిజన కాలనీ, గిరిజనులు, దళితులు వారి ఇళ్లు కనపడకుండా సుమారు 15 అడుగుల ఎత్తు గోడలు నిర్మించడం అత్యంత అమానవీయమని వేదిక బృందం అభిప్రాయపడింది. ఇదిఒకరకంగా అంటరానితనాన్ని చూపించడమేనని, ఇలా భారీ ప్రహరీ గోడలు నిర్మించిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై దళితులపై వేధింపుల కింద కేసు నమోదు చేయాలని వేదిక అభిప్రాయపడింది. వారి ప్రహరీ గోడలకు తమ ఇళ్లు అడ్డు వస్తున్నాయని ఇళ్లు ఖాళీ చేయాలని రియల్ ఎస్టేట్ వ్యాపారులు బెదిరిస్తున్నారని గిరిజన కాలనీ గిరిజనులు వేదిక బృందం ముందువాపోయారు. వర్షాలు వచ్చినప్పుడు తమ కాలనీ మునిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశానం కూడా మాయం చేసి, చెరువులో శ్మశానాన్ని కేటాయించారన్నారు. వర్షాలు వచ్చినప్పుడు, చెరువులో నీళ్లు ఉండటం వల్ల శవాలను పూడ్చలేక పోతున్నామని బృందం ముందు తెలియజేశారు. అలాగే ఇందిరమ్మ కాలనీ చుట్టూ భారీ ప్రహరీ గోడ నిర్మాణం వల్ల ప్రజలు పట్టణంలోకి రావాలంటే చుట్టూ తిరిగి రావాల్సి వస్తుందని సుమారు మూడు కిలోమీటర్ల దూరం పెరుగుతుందని వేదిక బృందం అభిప్రాయ పడింది. ముసునూరులో ఉన్న స్కూలుకు విద్యార్థులు రావాలంటే కూడా దూరం పెరిగి ఇబ్బందులు పడతారని బందం అభిప్రాయపడింది. ఎన్నో సంవత్సరాలుగా తాము కావలి పట్టణంలోకి రావడానికి ఉపయోగిస్తున్న రోడ్డును భారీ ప్రహరీ గోడతో మూసివేయడం అన్యాయమని ప్రజలు ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక బృందంతో అన్నారు. తమకు దారి లేకుండాచేయడం అమానుషమని తెలిపారు. ఇలా కాలనీల చుట్టూ భారీ ప్రహరీ గోడలు నిర్మించడానికి రియల్ ఎస్టేట్ వ్యాపారులకు ఎవరు అనుమతులు ఇచ్చారో అధికారులు తెలియజేయాలని డిమాండ్ చేశారు. నుడా అనుమతులు లేకుండానే భారీగా వెంచర్ల వేస్తూ ప్రభుత్వ ఖజానాకు గండికొడుతున్నారన్నారు. ఈ వెంచర్ల కోసం పెద్దపెద్ద మట్టి తిప్పల సైతం తొలిచి అక్రమంగా తమ వెంచర్లకు తరలించారని తెలిపారు. ఇవన్నీ అధికారులకు, కావలి ఎంఎల్ఎకు తెలుసు అని వారి ప్రోత్సాహంతోనే, వారి భాగస్వామ్యంతోనే జరుగుతున్నాయని వేదిక అభిప్రాయపడింది. రియల్ ఎస్టేట్ వెంచర్లే నుడా అనుమతులు లేకుండా అక్రమంగా వేస్తున్నారు. అక్రమంగా గ్రావెల్ తోలుతున్నారు. బరితెగించి పేదల దళితుల ఇళ్లకు దారులు కూడా లేకుండా భారీ ప్రహరీ గోడలు నిర్మిస్తున్నారు. అధికార పార్టీ అండదండలతోనే ఇంతగా రెచ్చిపోతున్నారన్నారు. తక్షణమే అక్రమంగా వేసిన వెంచర్లు భారీ ప్రహరీ గోడల నిర్మాణాలపై కలెక్టర్ చర్యలు తీసుకోవాలని వేదిక కోరింది. ఈ భారీ ప్రహరీ గోడ అక్రమ నిర్మాణాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తామని తెలిపింది. ప్రజలు భారీ ప్రహరీ గోడల అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలని ప్రజలకు ప్రజా స్వామిక హక్కుల పరిరక్షణ వేదిక పిలుపునిచ్చింది. ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ వేదిక సభ్యులు కరవది భాస్కర్, చింతాల వెంకట్రావు, పసుపులేటి పెంచలయ్య(సిపిఎం), దావులూరి దేవకుమార్, పొబ్బ సాయి విటల్, జి నాగార్జున, కే నరసింహం, ఎల్ లక్ష్మిరెడ్డి, పసుపులేటి మహేష్, గోసాల రవికాంత్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.


ప్రహరీ గోడ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న నాయకులు

నిధుల మళ్లింపు దారుణం

ప్రజాశక్తి-బిట్రగుంట



రాష్ట్రానికి కేంద్రం ఇస్తున్న ఎస్‌సి ఎస్‌టి నిధులను పక్కదారి మళ్లించడం దారుణమని దళిత సంరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్.మల్లి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత గిరిజనులకు చేస్తున్న అన్యాయంపై ఆదివారం బోగోలు బజార్‌లో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాన్ని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ల నుంచి ఎస్‌సి, ఎస్‌టిల దళితుల సబ్‌ప్లాన్ రూ.50 వేల కోట్ల నిధులను నవరత్నాలకు మళ్లిస్తున్నారని తెలిపారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రభుత్వ ఆస్తులను అదానికి అంటగడుతుంటే, రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సి ఎస్‌టి సంక్షేమ నిధులను పక్కదోవ పట్టిస్తుందని ఎద్దేవా చేశారు. నాలుగేళ్ల నుండి రాష్ట్రంలో ఎస్‌సి, ఎస్‌టిలు సబ్సిడీ రుణాలు లేక ఆర్థికంగా వెనకబడిపోతున్నారన్నారు. రాష్ట్రంలో ఎస్‌సి ఎస్‌టి శాసనసభ్యులు చాలామంది ఉన్నా దళితులకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించడం లేదన్నారు. కార్యక్రమంలో మిట్ట అశోక్, రమణయ్య, ఆత్మకూరి పోలయ్య, ఆటో కార్మికులు రెహమాన్, రమణయ్య, కుమార్, కాలు భాయ్, మస్తానయ్య, దళితులు, తదితరులు పాల్గొన్నారు.

24న విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

ప్రజాశక్తి-జలదంకి : మండలంలోని అన్నవరం ప్రధాన గ్రామంలో ఇటీవల నూతనంగా నిర్మించిన ఆలయంలో 'శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం 24వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఆదివారం కమిటీ సభ్యులు తెలిపారు. 21వ తేదీ నుండి 24వ తేదీ వరకు జరిగే కార్యక్రమాలు హోమాలు త్రయాత్మిక దీక్షతో శ్రీ వైఖానత ఆగమోక్త సాంప్రదాయం ప్రకారం జరుగుతాయన్నారు. టి.టి.డి. గోల్డ్ మెడల్ లిస్ట్‌కు చెందిన శ్రీ మాన్ నారాయణ వెంకట రమణ దీక్షితులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమాల సందర్భంగా నాలుగు రోజులపాటు ఆలయంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-కావలి : డి. ఆర్. విశ్వోదయ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం 65 మంది నిరుపేద వృద్ధులకు రూ.65వేల విలువైన బియ్యం, నిత్యావసర వస్తువులు, నగదులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ ఉమాచంద్ హాజరై పంపిణీ చేశారు. నిరుపేదలైన వృద్ధులకు డాక్టర్ డి.ఆర్.విశ్వోదయ సేవాసమితి చేస్తున్న వితరణ కార్యక్రమాలను ఆయన కొనియాడారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్ల వినయ్ కుమార్ రెడ్డి, డి.ఆర్.విశ్వోదయ సేవాసమితి సభ్యులు నల్లూరి రామ కృష్ణప్రసాద్, అమరావతి, సతీష్ సింగ్, రంగనాయకులు, జె.బి.జూనియర్, విద్యార్థులు పాల్గొన్నారు.

అల్లూరు వైసిపిలో విభేదాలు

- మండలకేంద్రంలో మరో పార్టీ ఆఫీసు
- రంగంలోకి దిగిన ఎంఎల్ఎ సతీమణి

ప్రజాశక్తి-అల్లూరు

అధికార పార్టీలో తారాస్థాయిలో విభేదాలు భగ్గుమంటున్నాయని ఆ పార్టీలో అధికారుల్ని సైతం తన గుప్పెట్లో పెట్టుకుని చక్రం తిప్పిన లక్ష్మణుడు ఎక్కడ అంటూ స్వయాన ఆ పార్టీ నేతలే ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. అతను ఆదేశిస్తే పోలీసు, రెవెన్యూ ఇతర శాఖల అధికారులకు ముచ్చెమటలు పట్టాల్సిందేనని తెలియజేస్తున్నారు. కావలి ఎంఎల్ఎ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి కుడి భుజమైన అతనిని పూర్తిగా పార్టీకి దూరం పెట్టడంతో నియోజకవర్గంలో ఆసక్తిగా నడుస్తున్న హాట్ టాపిక్. కాగా ఇందులో రాజకీయ అంతర్యమేమిటో అర్థం కావడం లేదని ప్రజలు, స్వయాన ఆ పార్టీ నేతలే తెలుపుతున్నారు. నియోజకవర్గంలో నిన్నమొన్నటిదాకా చక్రం తిప్పి రాజకీయాలకు ఎందుకు దూరంగా ఉన్నాడో అర్థం కాని పరిస్థితి ఏర్పడిందని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. హఠాత్ రాజకీయ పరిణామాలపై కొన్ని సన్నివేశాలు అర్థం కాక ప్రజలు తలబాదుకుంటున్నారు. అతి తక్కువ సమయంలోనే ఆ నేత రాష్ట్రస్థాయిలో గుర్తింపు తెచ్చుకున్నాడని జిల్లా అలాగే నియోజకవర్గంలో అధికార యంత్రాంగాన్ని గడగడలాడించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. ఎంఎల్ఎ అందుబాటులో ఉన్నా అనేక సమస్యలను విన్నవించేందుకు ప్రజలు, కార్యకర్తలు ఆయన ఇంటి వద్ద క్యూ కట్టి ఉండేవారని ప్రస్తుతం విభేదాలతో వెలవెలబోతుందని వెల్లడించారు. సాక్షాత్తు జగన్మోహన్ రెడ్డి ఆ వ్యక్తిని దూరం పెట్టమన్నట్లు నియోజకవర్గంలో హల్‌చల్ చేస్తున్న విస్తృత ప్రచారం. అలాగే మరొక ప్రచారం మేమిటంటే కావలి ఎంఎల్ఎ కావాలనే కుతూహలంతో ఆ నేత కన్ను కావలి సీటుపై పడిందని అందులో భాగంగా సజ్జలతో సంప్రదింపులు జరిగినట్లు గుసగుసలాడుతున్నారు. ఈ సంఘటనపై ఒక మంత్రి చాలా సీరియస్‌గా తీసుకొని శరవేగంగా పావులు కదిపి కావలి ఎంఎల్ఎకు జరిగిన విషయం పూసగుచ్చినట్లు తెలిపారన్నారు. అయితే లోగుట్టు పెరుమాళ్లకెరుకా.. ప్రస్తుత రాజకీయాలలో శాశ్వత శత్రువులు, మిత్రులు ఉండరని అనేకమంది తెలియజేస్తున్నారు. ఇదిలా ఉండగా ఎంఎల్ఎ సతీమణి ఆదిలక్ష్మి ప్రత్యక్ష రాజకీయాలలో కీలకపాత్ర పోషిస్తూ నియోజకవర్గంలో ఇప్పటికే అనేకమంది నేతలతో సంప్రదింపులు జరిపి తన భర్తను హ్యాట్రిక్ ఎంఎల్ఎగా గెలిపించాలని కోరినట్లు పూర్తి సమాచారం. నియోజకవర్గంలో ఉన్న మహిళా నేతలను అక్కున చేర్చుకొని పూర్తి భరోసా తనదని హామీనిచ్చినట్లు కొందరు తెలియజేస్తున్నారు. ఇటీవల కావలి మున్సిపల్ హై స్కూల్‌లో ఆమె భూమిపూజ కార్యక్రమంలో పాల్గొని అన్ని తానై చూసుకున్నారన్నారు. ఆ నేత వ్యవహార శైలి గిట్టక మండలంలో కొంతమంది అధికార పార్టీ నేతలు పార్టీకి దూరంగా ఉంటూ ఎంఎల్ఎ వచ్చినా ముఖం చాట వేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయని అంటున్నారు. అంతేకాకుండా అధికార పార్టీలో కొనసాగుతున్నా ఆ నాయకుడు తీవ్ర ఒత్తిడి కారణంగా అధికారులు మాకు ఎలాంటి పనులు చేయలేదని బహిరంగ వ్యాఖ్యలు చేశారు. ఇటీవల కొద్ది రోజుల క్రితం ఎంఎల్ఎ ఎంపిడిఓ కార్యాలయానికి విచ్చేయగా పాత కాపులందరూ ఆయన వెంట ఉండడంతో అనేక అనుమానాలకు ఆజ్యం పోసిందని ఆరోపించారు. కొంత మంది కార్యకర్తలైతే ఆ గట్టు నుండాల లేక ఈ గట్టునుండాలా అంటూ తేల్చుకోలేక పోతున్నారు. అల్లూరు పాత బస్టాండ్ సమీపంలో మరో వైసిపి కార్యాలయాన్ని ఏప్రిల్ మాసంలో ఏర్పాటుకు శరవేగంగా సన్నాహాలు జరుగుతున్నాయని ఆ పార్టీ నేతలే అంటున్నారు.

1వ అదనపు సీనియర్ సివిల్‌జడ్జి : నెల్లూరు
I.A.No: 477/2022, 478/2022, 479/2022
I.A.No: 415/2018
O.S.No : 693/2008

షేక్.జుల్‌కర్‌నైన్ ... పిటిషనరు / వాది

Vs

2. **షేక్.గుల్‌జార్,** W/o **దస్తగిరి,** D.No.26-10-1290, ఆటో నగర్, పడారుపల్లి, నెల్లూరు సిటీ.
3. **షేక్.బాబా,** S/o **ఖాదర్ బాషా,** 3వ ఫ్లోరు, వైభవ్ ఫార్చ్యూన్ అపార్టుమెంటు, హరనాథపురం, నెల్లూరు సిటీ.

మరియు ఇతరులు ... రెస్పాండెంట్లు

నోటీసు

ఇందుమూలంగా పై తెలియపరచిన **షేక్.గుల్‌జార్, షేక్.బాబా** గారలకు తెలియజేడమైనది ఏమనగా పై నెంబరు I.A.No: 415/2018 లో **షేక్.బల్‌కిస్‌బేగం** చనిపోయినట్లు వారి వారసుల విషయమై పైన తెలియ పరచిన I.A. నెంబర్లు 477/2022, 478/2022 మరియు 479/2022 పిటిషన్లు మీపైన వేసి ఉన్నవి. సదరు పిటిషన్లు మీనోటీసు నిమిత్తం **తే27-02-2023ది** వాయిదా వేసి ఉండినందున మీరు స్వయముగా గానీ మీ తరపు లాయరు ద్వారా గానీ ఆదినము **ఉదయం 10.30 గంటలకు** హాజరై సంజాయిషీ చెప్పుకొనని యెడల పై కేసు మీ పరోక్షములో తీర్మానించబడును.

నెల్లూరు
17-02-2023

ఆర్. సత్యనారాయణ
పిటిషనర్ల తరపు న్యాయవాది